సాక్షి జనగామ

శనివారం । 28 । డిసెంబర్ । 2024



నిరాడంబరంగా సీఎం కప్ పోటీలు

హనుమకొండలోని జేఎన్ఎస్‌లో ఐదు రోజుల పాటు కొనసాగనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలు శుక్రవారం నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. - 10లో▸



దీక్షాంత్ పరేడ్ రద్దు..

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో శుక్రవారం మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో జరగాల్సిన దీక్షాంత్ పరేడ్ రద్దయింది. - 10లో▸

గరిష్టం/కనిష్టం $29^0/18^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

నేడు సీపీతో ఫోన్ ఇన్



అంబర్ కిషోర్ ఝా
వరంగల్ పోలీస్ కమిషనర్


వరంగల్ క్రైం: నూతన సంవత్సర వేడుకలకు యువతీ యువకులతో పాటు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పోలీస్ అధికారులు నూతన సంవత్సర వేడుకల్లో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ఈవెంట్ల నిర్వహణ అనుమతి, రహదారుల మూసివేత, దేవాలయాలు, చర్చీలు, ఇతర ప్రార్థన స్థలాల్లో బందోబస్తు ఏర్పాట్లు, కమిషనరేట్ పరిధిలో, ప్రత్యేకించి వరంగల్ నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు, ఇతర అంశాలపై మీకున్న అనుమానాలు, సందేహాలను నేరుగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా దృష్టికి తీసుకెళ్లే అవకాశం 'సాక్షి' కల్పించింది. నేడు(శనివారం) సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమంలో కమిషనర్‌తో మాట్లాడి విషయాన్ని నేరుగా తెలుసుకోవచ్చు.

నేడు (శనివారం)
సమయం : 12.30 నుంచి 1.30 గంటల వరకు
సెల్ నంబర్ : 87126 85100

'లోకల్' సమరానికి సై..

స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు

- వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల జాబితా
- నూతన రిజర్వేషన్లపై ప్రత్యేక దృష్టి
- బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్‌కు చర్యలు
- మండలాలకు నోడల్ ఆఫీసర్ల నియామకం
- జిల్లాలో 4.17లక్షల మంది ఓటర్లు



జనగామ: స్థానిక సంస్థల ఎన్నికలకు సర్కారు సై అంటుండగా.. పల్లెల్లో ఎలక్షన్ ఫీవర్ మొదలైంది. ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రకటించగా.. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల తుది జాబితా వెల్లడించారు. మండలాల వారీగా నోడల్ ఆఫీసర్లను సైతం ప్రకటించారు. ఈ క్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డుల వారీగా బరిలో నిలిచే ఆశావహులు ఓటర్లకు దగ్గరయ్యేందుకు ఇప్పటి నుంచే ఎన్నికల 'గేమ్' ప్రారంభిస్తున్నారు. మృతుల కుటుంబాలకు సాయం చేస్తూ.. శుభకార్యాలకు మిస్ కాకుండా హాజరవుతూ మార్కులు కొట్టేసేందుకు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసేందుకు టికెట్ కోసం అధిష్టానం ఆశీస్సుల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే.. నూతన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరుగాయనే ప్రభుత్వ సంకేతాలతో ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది.

రిజర్వేషన్ల సమస్యతో ఆలస్యం

ఈ ఏడాది ఫిబ్రవరి 2న సర్పంచ్, జూలై 4న జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో స్పెషలాఫీసర్ల పాలన వచ్చింది. వచ్చే జనవరి 27వ తేదీతో మున్సిపల్ పాలకవర్గం కాలపరిమితి ముగియనుంది. ఈ డిసెంబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం మొదటగా భావించినప్పటికీ రిజర్వేషన్ల ఖరారులో తలెత్తిన సమస్యతో వాయిదా వేశారు. నూతన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. అందుకు తగ్గట్టు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. కొద్ది రోజుల్లో బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ ప్రక్రియ మొదలవనుండగా.. ఎన్నికలకు పంచాయతీరాజ్ కమిషన్ నుంచి నోటిఫికేషన్ రావడమే మిగిలింది. జిల్లాకు 50 శాతం మేర ఎన్నికల సామగ్రి చేరుకుంది. ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులకు సంబంధించిన అంశాలతో ప్రింటింగ్ పేపర్లు ఉన్నాయి. అయితే, ఇటీవల కలెక్టర్ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రతీ విభాగానికి ఒక జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించారు. 'స్థానిక' పోరుకు ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



తుది జాబితా వెల్లడి

మండలాలు, గ్రామాల్లో ఈనెల 7 నుంచి 12 వరకు పోలింగ్ స్టేషన్‌ల వారీగా ముసాయిదా తుది జాబితాను ప్రదర్శించారు. 16న కలెక్టర్ అప్రూవల్ తీసుకుని 17న మండలాల్లో ప్రదర్శించారు. 2,576 పోలింగ్ కేంద్రాల్లో ప్రజల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. జిల్లాలోని 283 జీపీల పరిధిలో 2,576 వార్డులు ఉన్నాయి. అందులో 4,17,297 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,06,342 మంది, మహిళలు 2,10,950 మంది, ఇతరులు (ట్రాన్స్‌జెండర్స్) ఐదుగురు ఉన్నారు. పురుషుల ఓట్ల కంటే మహిళల ఓట్లు 4,608 అధికంగా ఉండగా.. ఇందులో 7,500 కొత్త ఓటర్లు నమోదయ్యారు.

టీ–పోల్‌లో అప్‌లోడ్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లోని టీ-పోల్ పోర్టర్‌లో ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను నమోదు చేశారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్‌కు సంబంధించిన పనులపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

ప్రత్యేక అధికారుల నియామకం

స్థానిక ఎన్నికలకు సంబంధించి కలెక్టర్ రిజ్వాన్ బాషా మండలాలకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఆయన ఆదేశించారు.

మండలాల వారీగా కొత్త ఓటర్ల వివరాలు

మండలం	కొత్త ఓటర్లు
బచ్చన్నపేట	982
చిల్పూరు	528
దేవరుప్పుల	647
స్టేషన్‌ఘన్‌పూర్	743
జనగామ	525
కొడకండ్ల	643
లింగాలఘణపురం	611
నర్మెట	236
పాలకుర్తి	889
రఘునాథపల్లి	718
తరిగొప్పుల	307
జఫర్‌గఢ్	671

14 మంది మృతి

గత పదవీ కాలంలో 14 మంది సర్పంచ్‌లు మృతి చెందగా.. ముగ్గురు స్వచ్ఛందంగా తప్పుకున్నారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఓ సర్పంచ్‌ను పదవి నుంచి తొలగించగా.. మరో ఉప సర్పంచ్‌ను సైతం రిమూవ్ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం శివునిపల్లిలో రిజర్వేషన్ల రగడపై సర్పంచ్ పదవికి నామినేషన్లు రాలేదు. ఒకే ఒక్క వార్డు సభ్యుడు నామినేషన్ వేయగా, ఆయన గెలిచినట్టు ప్రకటించారు. తనకే సర్పంచ్ బాధ్యతలు అప్పగించాలని సదరు వార్డు సభ్యుడు కోర్టుకు వెళ్లగా పదవీ కాలం ముగిసే సమయంలో అవకాశం లభించింది.

ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం..



ప్రభుత్వం ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా సిద్ధంగా ఉన్నాం. గ్రామ స్థాయిలో పోలింగ్ కేంద్రాలను ఫైనల్ చేశాం. ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు రాగానే తదుపరి ప్రక్రియ ప్రారంభిస్తాం.

– షేక్ రిజ్వాన్ బాషా, కలెక్టర్

రౌడీషీటర్లపై ఉక్కుపాదం

- పోలీసులు సివిల్ పంచాయితీలకు దూరంగా ఉండాలి
- కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి
- నేర సమీక్షలో సీపీ అంబర్ కిషోర్ ఝా



సమీక్షలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: రౌడీషీటర్లను ఉక్కుపాదంతో అణచివేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. కమిషనరేట్‌లో శుక్రవారం పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. పెండింగ్, మిస్సింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. 'నిజాయితీగా పనిచేయాలి.. సివిల్ పంచాయితీలకు దూరంగా ఉండాలి.. తప్పుడు కేసు నమోదు చేయొద్దు.. పోలీసులు అప్రమత్తంగా లేకుంటే శాంతిభద్రతలు అదుపు తప్పుతాయి' అని పేర్కొన్నారు. ముందస్తు సమాచారంతోపాటు రౌడీషీటర్ల స్థితిగతులపై వివరాలు సేకరించాలని సూచించారు. డీసీపీలు రాజమహేంద్రనాయక్, రవీందర్, ఏఎస్పీ మనాన్ భట్, అదనపు డీసీపీ రవి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

మాజీ ప్రధానికి ఘన నివాళి

- మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి

జనగామ: దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పూలమాల వేసి నివాళర్పించి మాట్లాడారు. మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని.. ఆయన పదేళ్ల పరిపాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, టీపీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, వంగాల మల్లారెడ్డి, మేడ శ్రీనివాస్, గాదెపాక రాంచందర్, బడికె ఇందిరకిష్టస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ సంతాపం

స్టేషన్‌ఘన్‌పూర్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు.

రివైండ్ ◂◂ 2024

తెలంగాణ ప్రజల చూపంతా ఇప్పుడు గ్రేటర్ వరంగల్‌పైనే. రోడ్డు, రైలు మార్గాలైనా.. విమానయానమైనా, హెల్త్ హబ్‌గా పేరొందాలన్నా.. నియో మెట్రోస్టేషన్ ఏర్పాటు చేయాలన్నా.. రాష్ట్ర రాజధాని తర్వాత వరంగల్‌కే స్కోప్ ఎక్కువ. నిధుల కొరత ఒకవైపు ఉన్నా.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనుల్లో ఈ ఏడాది(2024) కొంత కదలిక వచ్చింది. పలు ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. నగరంలో ఈ ఏడాది జరిగిన అభివృద్ధి, కొనసాగుతున్న పనులపై 'సాక్షి' మననం.



- వివరాలు 10లో▸

న్యూస్‌రీల్

జీడికల్ ఆలయంలో జిల్లా జడ్జి పూజలు



లింగాలఘణపురం: మండలంలోని జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో జిల్లా జడ్జి రవీందర్‌శర్మ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో సహోదరుడు అవదూత శర్మ పాల్గొన్నారు. అంతకు ముందు వారికి ఆలయ పూజారులు భార్గవాచార్యులు, మురళీధరాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మూర్తి, ఈఓ వంశీ, జూనియర్ అసిస్టెంట్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ సన్నబియ్యం సేకరణ షురూ..



జనగామ: జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రభుత్వం సీఎంఆర్ కోసం మిల్లులకు కేటాయించిన సన్న ధాన్యానికి సంబంధించి బియ్యం సేకరణ మొదలైంది. జనగామ ఎస్‌డబ్ల్యూసీ(గోదాం)లో అరుణోదయ ఆగ్రో ఇండస్ట్రీస్‌కు సంబంధించిన 25శాతం సన్న బియ్యాన్ని మిల్లర్స్ ప్రతినిధులు బెలిదె వెంకన్న, పెద్ది వెంకటనారాయణగౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, మిల్లర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మిల్లర్లు గాదె శ్రీను, మార్యాల లక్ష్మణ్, జిల్లా హరికిషన్, శివన్న, రాజు, వేణు, సివిల్ సప్లయీస్ నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎం టెక్నికల్ బాలకృష్ణ, టీఏ నాగరాజు, ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ కృష్ణ పాల్గొన్నారు.

పీజీలో రితికకు స్టేట్ 2వ ర్యాంకు



జనగామ: జనగామ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు–శ్రీదేవి(ఎంజీఎం రేడియాలజీ విభాగం హెచ్‌ఓడీ) దంపతుల కుమార్తె దుగ్యాల రితిక నీట్–పీజీలో స్టేట్–2వ ర్యాంకు సాధించింది. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చేయగా.. లోకల్, నాన్‌లోకల్ విషయమై కోర్టు తీర్పు నేపథ్యంలో ర్యాంకులు ప్రకటించ లేదు. జాతీయ స్థాయిలో 117వ ర్యాంకు సాధించిన ఆమె.. మూడేళ్ల పీజీ కోర్సు కోసం నిమ్స్ కళాశాలలో చేరారు. ప్రస్తుతం ప్రకటించిన స్టేట్ లెవల్ ర్యాంకుల నేపథ్యంలో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టెండర్లు వాయిదా

పాలకుర్తి టౌన్: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో ప్రభుత్వం శుక్రవారం సెలువు దినంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నిర్వహించాల్సిన డ్రా, సీల్డ్ టెండర్లను వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ మోహన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి జనవరి 4న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26న టెండర్ల షెడ్యూలు కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఈ టెండర్లు ఉంటాయన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి రవీంద్ర శర్మ

జనగామ రూరల్: ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్ర శర్మ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం కొత్త పారా లీగల్ వలంటీర్లకు నిర్వహించిన ట్రెనింగ్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు జిల్లాలోని ప్రతీ మారుమూల గ్రామానికి వెళ్లి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకొని చట్టపరంగా ఏదైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ దృష్టికి తేవాలన్నారు. సమాజంలో బలహీన వర్గాలకు చెందిన వారు గౌరవంగా జీవించే హక్కు గురించి తెలుసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి ఇ.విక్రమ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ప్రతీ హక్కును ఎలా ఉపయోగించుకోవాలో ప్రజలకు విస్తృతంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కర్ర ఎల్లారెడ్డి, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.రవీంద్ర పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



వైద్య శిబిరంలో రోగికి బీపీ చెక్‌చేస్తున్న డాక్టర్

లింగాలఘణపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవితేజ ఆధ్వర్యాన మండల కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లింగాలఘణపురంలో నెల రోజులుగా వరుస క్రమంలో పలువురు మృత్యువాత పడడం, ఇప్పటికే పది మంది చనిపోవడంతో 'ఆ ఊరికి ఏమైంది..?' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా స్పందించి డీఎంహెచ్‌ఓతో మాట్లాడి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవితేజ మాట్లాడుతూ ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే పీహెచ్‌సీకి రావాలని, తగిన పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. వైద్య శిబిరంలో డాక్టర్లు కిరణ్, సంధ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసు, ల్యాబ్‌టెక్నీషియన్ శ్రీకాంత్, సూపర్‌వైజర్ సుజాత, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి
- ఘన్‌పూర్‌లో పార్టీ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలపై సమరశీల పోరాటాలు చేయాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సీపీఎం జిల్లా మూడవ మహాసభలు శుక్రవారం డివిజన్ కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ముందుగా రైల్వేగేట్ సమీపాన ఏర్పాటు చేసిన సభాప్రాంగణం వద్దకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కార్యదర్శి మునిగెల రమేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలు, కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బీజేపీ సర్కారు.. ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే కాకుండా.. రూ.50 లక్షల కోట్ల ప్రభుత్వ ఆస్తులను అమ్ముకుందని ఆరోపించారు. ప్రజాసమస్యల్ని పట్టించుకోకుండా మత విద్వేషాలను రెచ్చగొడుతున్న ఈ మోదీ సర్కారును గద్దెదింపడానికి ప్రజలు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు, రైతులకు, మహిళలకు, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో కేసీఆర్‌కు పట్టిన గతి పడుతుందని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్ ప్రసంగించగా.. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సిద్దిపేట, జగిత్యాల జిల్లాల కార్యదర్శులు ఆముదాల మల్లారెడ్డి, పుప్పాల శ్రీకాంత్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పిట్టల రవి తదితరులు పాల్గొన్నారు.

తల్లి, పిల్ల.. ఓ మగపులి

నల్లబెల్లి, కొత్తగూడ మండలాల్లో సంచారం

- భయం గుప్పిట్లో జనం
- పెద్దలొద్ది అటవీ ప్రాంతంలో ఆడపులి, పులి పిల్ల.. కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం, కోనాపురంలో మగపులి పాదముద్రలు
- పనులకు వెళ్లని రైతులు, కూలీలు



నల్లబెల్లి మండలం రుద్రగూడెం శివారులో పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్ఓ



అధికారులు సేకరించిన పులి, పిల్ల పులి, మగపులి అడుగులు

నల్లబెల్లి: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి గ్రామాల శివారులో, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం కోనాపురం అటవీ ప్రాంతంలో పులుల సంచారం వార్త కలకలం రేపుతోంది. ఈ రెండు మండలాల్లో ఓ ఆడపులి, పిల్ల పులి, మరో మగ పులి సంచారం నిర్ధారణ కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొండాపూర్‌కు చెందిన మల్లబోయిన కొమురయ్య రోజు మాదిరిగానే గురువారం తనకున్న 150 మేకలను పెద్దలొద్ది అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లాడు. అడవి జంతువును తింటున్న పెద్ద పులిని చూసి మేకలు, కుక్క భయపడి బెదిరి చెల్లాచెదురయ్యాయి. పెద్దలొద్ది అవతలి ఒడ్డున పెద్దపులి కనిపించడంతో భయంతో కొమురయ్య వెనుదిరిగాడు.

పొలాలనుంచి వెనుదిరిగిన రైతులు

నల్లబెల్లి మండలంలోని వ్యవసాయ పొలాల వద్ద పులి పాదముద్రలను గుర్తించిన రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన నర్సంపేట ఎఫ్ఆర్ఓ రవికిరణ్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం గ్రామాలను సందర్శించారు. అటవీప్రాంతం, పంటపొలాల్లో గాలించారు. కొండాపూర్ పెద్దలొద్ది అటవీ ప్రాంతంలో ఆడపులి, పులిపిల్ల పాదముద్రలు ఉండగా, కొండాపూర్, మూడుచెక్కలపల్లి, రుద్రగూడెం గ్రామాల పంట పొలాల్లో, కొత్తగూడ మండలం కోనాపురం ముసలిమడుగు అటవీ ప్రాంత పొలాల్లో మగపులి పాదముద్రలను సేకరించారు. చివరగా ఆడపులి తన పిల్లతోపాటు, మగపులి కోనాపూర్ అటవీప్రాంతానికి వేర్వేరుగా వెళ్లినట్లు చెబుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు, కూలీలు పెద్దపులుల సంచారం విషయం తెలియడంతో పనులు చేయలేమని వెనుదిరుగుతున్నారు. కూలీల భయాన్ని అర్థం చేసుకున్న రైతులు చేసేదేమిలేక మిన్నకుండిపోతున్నారు.

పులి తిరుగుతోంది... జాగ్రత్త

గ్రామాల్లో పోలీసుల దండోరా

నల్లబెల్లి మండలంలో పెద్ద పులుల సంచారంతో పోలీస్ అధికారులు గ్రామాల్లో దండోరా వేయించారు. 'పంట పొలాల్లో పెద్ద పులుల సంచారం ఉంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. రెండు రోజుల వరకు రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లొద్దు.. రాత్రి వేళ ఒంటరిగా వెళ్లొద్దు.. ఒక వేళ పెద్దపులులు కనిపిస్తే పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.. పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ తీగలు అమర్చవద్దు' అని సూచిస్తున్నారు.

వ్యవసాయ పనులు చేయలేకపోతున్నాం..



రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి శివారులో పెద్దపులి సంచరించినట్లు పాదముద్రల ఆనవాళ్లు ఉన్నాయి. వ్యవసాయ పనుల కోసం శుక్రవారం ఉదయం వచ్చిన కూలీలు, రైతులు తిరిగివెళ్లారు. రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి మధ్య పంటపొలాల్లో ఉన్న పలుగు ఏనలో పెద్దపులి ఉంటుందని ఫారెస్ట్ అధికారులు సందేహం వ్యక్తం చేశారు. పులి ఉన్నట్లు గుర్తిస్తే అటవీ ప్రాంతానికి పంపించే చర్యలు అధికారులు చేపట్టాలి.

– బుర్ర రాఘవరెడ్డి, రైతు, రుద్రగూడెం

అప్రమత్తంగా ఉండాలి



పులులు సంచరించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రెండు రోజులు వ్యవసాయ పనుల కోసం పంట పొలాలు, బయటకి వెళ్లొద్దు. గ్రామస్తులు, రైతులు, గొర్రెలకాపరులు జాగ్రత్తగా ఉండాలి. పంటలను కాపాడుకునేందుకు రైతులు విద్యుత్ తీగలను ఏర్పాటు చేయవద్దు. పులి తిరిగి వెళ్లిపోతుంది. ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందించాం.

– రవికిరణ్, ఎఫ్ఆర్ఓ, నర్సంపేట

రైజింగ్.. సిటీ!

ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులతో వరంగల్ నగరానికి న్యూ లుక్..

- గ్రేటర్ పరిధిలో పలు అభివృద్ధి పనులు
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో మెడికల్ హబ్
- అయోధ్యపురంలో వందేభారత్‌తో సహా అన్ని రైల్వే కోచ్‌ల తయారీ
- తిరుమాడ వీధులతో భద్రకాళికి కొత్త రూపు
- కళామతల్లి సిగలో కాళోజీ కళాక్షేత్రం

గ్రేటర్ వరంగల్ మహానగరం కొత్త లుక్ సంతరించుకుంటోంది. రాష్ట్ర రాజధానికి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ నగరం 406 కిలోమీటర్ల విస్తీర్ణంతో రాష్ట్రంలో రెండో అతిపెద్దది. రాష్ట్రానికి రెండో రాజధాని అయ్యేందుకు అన్ని అర్హతలుండడం, భవిష్యత్ అవసరాల దృష్ట్యా అన్ని హంగులు సమకూరుతున్నాయి. కాకతీయులు నిర్మించిన కోటలు, సరస్సులు, దేవాలయలతో ప్రసిద్ధ పర్యాటక ఆకర్షణ నగరంగా గుర్తింపు పొందగా ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులతో సరికొత్తనగరంగా రూపుదిద్దుకుంటోంది. నగరంలో ఈ ఏడాది(2024)కొనసాగుతున్న ముఖ్యమైన అభివృద్ధి పనుల ఏఐ (నమూనా) చిత్రాలతో 'సాక్షి' ప్రత్యేక కథనం.

- వరంగల్ డెస్క్



విమానయానం

మరికొద్ది రోజుల్లో నగరం నుంచి విమానాలు ఎగరనున్నాయి. కేంద్రం ఉడాన్ (ఉడో దేశ్ కీ ఆమ్ నాగరిక్) పథకం కింద మామునూరు విమానాశ్రయాన్ని 2022 సెప్టెంబర్‌లో ఎంపిక చేసింది. వరంగల్ శివారులోని మామునూరులో నిజాం కాలంనాటి ఎయిర్ స్ట్రిప్ అందుబాటులో ఉండేది. అక్కడ 1,400 మీటర్ల పొడవైన రన్ వే, గ్లైడర్స్ దిగేందుకు మరో చిన్న రన్ వే ఉంది. ఆ పాత ఎయిర్ స్ట్రిప్‌నకు చెందిన 696 ఎకరాల భూమి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆధీనంలో ఉంది. మిగతా భూసేకరణకు కూడా రైతులు అంగీకరించారు. ఎయిర్‌పోర్టు పూర్తయితే 50 నుంచి 186 మంది ప్రయాణించేలా వీలున్న 37.6 మీటర్లు (123 ఫీట్లు) పొడవనున్న ఏ 320, బీ-737 విమానాలు రాకపోకలు సాగించనున్నాయి.

ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ చకచకా..

కాజీపేట అయోధ్యపురం వద్ద 160 ఎకరాల్లో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ గత సంవత్సరం శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తికాగా.. 2025 ఆగస్టులో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. వ్యాగన్ షెడ్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా కేంద్రం ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే కోచ్ ఫ్యాక్టరీకి రూ.580 కోట్లు, మరో దఫా రూ.66 కోట్లు మంజూరు చేసింది. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే ఇక్కడ వందే భారత్‌తో సహా అన్ని రకాల రైల్వేకోచ్‌లు తయారుకానున్నాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాజీపేట వ్యాగన్, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అయితే ప్రత్యక్షంగా.. పరోక్షంగా సుమారు 10వేల మందికి ఉపాధి లభించనుంది.

భళా.. కాళోజీ కళాక్షేత్రం

హనుమకొండ బాలసముద్రంలోని సర్వే నంబర్ 1066 'కుడా' (హయగ్రీవాచారి కాంపౌండ్) భూమిలో 4.20 ఎకరాల్లో పూర్తి సెంట్రలైజ్డ్ ఏసీతో అత్యాధునిక ఆడియో, విజువల్ సిస్టమ్‌లతో సాంస్కృతిక కార్యక్రమాలు, థియేటర్ ప్రదర్శనలు, ప్రొజెక్టర్, ప్రీ-ఫంక్షన్ లాబీ, ఆట్రియంలు, ల్యాండ్ స్కేపింగ్, వీధి దీపాలు, ఫౌంటెన్లతో నిర్మించారు. చిన్నపాటి సాంస్కృతిక సమావేశాల కోసం ప్రత్యేకంగా నాలుగు మినీ హాళ్లు అందుబాటులో ఉన్నాయి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇందులో కాళోజీ నారాయణరావు ఫొటోలు, జ్ఞాపకాలు, పురస్కారాలు వంటి అంశాలు ప్రదర్శిస్తారు. వీల్ చైర్స్ కోసం ప్రత్యేకంగా ర్యాంప్ నిర్మించారు. రాజసం ఉట్టిపడేలా చేపట్టిన నిర్మాణం ఆకట్టుకుంటోంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కన్నా పెద్దదిగా చెప్పవచ్చు.

తల్లీ.. భద్రకాళి

నగరంలోని భద్రకాళి దేవాలయం చుట్టూ మాడవీధుల నిర్మాణంలో భాగంగా చెరువును 60 అడుగులు ముందుకు జరపాల్సి ఉంది. దీంతోపాటు చెరువు ఆధునికీకరణ చేపట్టాల్సి ఉంది. ఈ మేరకు ఇప్పటికే చెరువులోని నీటిని ఖాళీ చేశారు. పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి. ఆలయం చుట్టూ నిర్మించే మాడ వీధుల నిర్మాణంలో భాగంగా ఆలయానికి ప్రాకారం నిర్మాణం చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాకారానికి నాలుగు దిశల్లో నాలుగు ద్వారాలు ఏర్పాటుచేసి వాటికి గోపురాలు నిర్మించనున్నారు. ఉత్తరం వైపున ఉన్న వేదపాఠశాలనుంచి ప్రస్తుతమున్న ప్రధాన గేటు తూర్పు వైపుగా ఏర్పాటు చేయనున్నారు. అమ్మవారికి ఎదురుగా రాజగోపురం 120 అడుగుల ఎత్తు.. 9 అంతస్తులతో నిర్మించనున్నారు. ఒక్క రాజగోపురానికే రూ.20 కోట్లు ఖర్చవుతాయని అంచనా.

వరంగల్ ఆర్టీసీ బస్టాండ్.. నియో మెట్రో స్టేషన్

వరంగల్ బస్టాండ్ ఆధునికీకరణకు సుమారు నాలుగు దశాబ్దాల తరువాత ముహూర్తం కుదిరింది. 1984లో ఈ బస్టాండ్‌ను ప్రారంభించగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక హంగులతో నిర్మించతలపెట్టారు. ఈ మేరకు పాత బస్టాండ్‌ను కూల్చివేశారు. రైల్వేస్టేషన్ పక్కనే ఉండడంతో నియో మెట్రో రైల్వేస్టేషన్ వచ్చేలానిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) సుమారు రూ.73.50 కోట్లతో ప్రాథమిక అంచనాలు రూపొందించి.. జీప్లస్5 భవనం చేపట్టాలని నిర్ణయించారు. భూగర్భంలో రెండు పార్కింగ్ కేంద్రాలు, ఆర్టీసీ కార్యాలయం, వాణిజ్య దుకాణాలు, బాంక్వెట్‌హాల్, మల్టీప్లెక్స్, హోటల్, రెస్టారెంట్ ఉండేలా రూపొందించారు. ఒకేసారి 35 బస్సుల వరకు నిలిపి ఉంచేలా ఫ్లాట్ ఫామ్‌లు డిజైన్ చేశారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. పూర్తయితే వరంగల్ పరిధి రూపురేఖలు మారిపోనున్నాయి.

కాజీపేట జంక్షన్ రీమోడలింగ్

కాజీపేట జంక్షన్‌ను అమృత్‌భారత్ పథకంలో భాగంగా కేంద్రం నిధులతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైటెక్ హంగులతో అత్యాధునీకరిస్తున్నారు. రైల్వే స్టేషన్ ఎంట్రెన్స్‌లో పోర్టికో, ప్రయాణికుల అప్పర్‌క్లాస్ వెయిటింగ్ హాల్ నిర్మాణం, ప్లాట్‌ఫాంల విస్తరణ, న్యూ టాయిలెట్స్ బ్లాక్, రైల్వే అధికారుల కార్యాలయాలు, గ్రీన్ గార్డెన్, రోడ్లు, పాత్‌వే, పార్కింగ్, సర్క్యులేషన్ ఏరియా స్మూత్ ట్రాఫిక్ ఫ్లో, రెండు లిఫ్ట్‌లు, 3 ఎస్కలేటర్లు, ప్యాసింజర్ ఫ్రెండ్లీ సైన్ బోర్డులు, నూతన నిర్మాణాలు, రైలు కోచ్‌తో రెస్టారెంట్ హోటల్, కమర్షియల్ డెవలప్‌మెంట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. వంద ఏళ్ల కాలం నాటి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించి అదే స్థలంలో నూతనంగా మోడల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. అన్ని విధాలా రెనోవేషన్ పనులు పూర్తయితే కాజీపేట జంక్షన్‌ను వరల్డ్‌క్లాస్ రైల్వే స్టేషన్‌గా చూడవచ్చు.

24 అంతస్తులు.. 2 వేల పడకలు

వరంగల్ నగరం మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో సెంట్రల్ జైలు ప్రాంగణంలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. మొదట్లో రూ.1,150 కోట్లతో 24 అంతస్తులు, 2వేల పడకలతో నిర్మాణం చేపట్టారు. 24 అంతస్తుల్లో 8 క్లినికల్ విభాగానికి, 3 అంతస్తులు అడ్మినిస్ట్రేషన్ విభాగానికి, మిగతా అంతస్తులు మెడికల్ ఎడ్యుకేషన్ ఉపయోగించే విధంగా నిర్మాణం చేపట్టారు. రూ.1,150 కోట్ల ఆస్పత్రి వ్యయాన్ని సదరు నిర్మాణ ఏజెన్సీ రూ. 1,750 కోట్లకు పెంచింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రి పనులపై సమీక్షించింది. సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. దీంతో ఆస్పత్రి పనులకు కొంత ఆటంకం కలుగుతోంది. ఏదిఏమైనా నిర్మాణం పూర్తయితే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు పొందొచ్చు.

పాపం పసికందు..

- రైలులో బాలుడిని వదిలివెళ్లిన మహిళ
- డయల్ 100కు కాల్ చేసి సమాచారమిచ్చిన ప్రయాణికులు
- చేరదీసి చైల్డ్ వెల్ఫేర్‌కు అప్పగించిన కాజీపేట జీఆర్ పోలీసులు



రైలులో మహిళ వదిలి వెళ్లిన బాలుడు

కాజీపేట రూరల్ : పాపం పసికందు. భారమనుకుందో? లేదా అపహరిస్తుందో తెలియదుకాని ఓ మహిళ.. బాలుడిని రైలులో వదిలేసి వెళ్లింది. దీంతో ఆ బాలుడు వెక్కివెక్కి ఏడ్చుకుంటూ ఆమె కోసం రైలులోనే తిరుగుతుండగా ప్రయాణికులు గుర్తించారు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించగా కాజీపేట జీఆర్ పోలీసులు చేరదీసి చైల్డ్ వెల్ఫేర్‌కు అప్పగించారు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి కథనం ప్రకారం.. నాగర్‌సోల్- నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ రెండు, మూడు సంవత్సరాల మధ్య వయస్సు గల ఓ బాలుడిని జనరల్ బోగీలో వదిలి వెళ్లిపోయింది. ఆమె కోసం బోగీలో అమాయకంగా తిరుగుతున్న బాలుడిని గుర్తించిన ప్రయాణికులు.. డయల్ 100కు కాల్ చేశారు. పోలీస్ కంట్రోల్ రూం సిబ్బంది కాజీపేట జీఆర్పీ పోలీసులను అప్రమత్తం చేశారు. రైలు కాజీపేట జంక్షన్‌కు చేరుకోగా బోగీలో నుంచి బాలుడిని చేరదీసి చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ సిబ్బందికి అప్పగించారు. కాగా, బాలుడిని వదిలివెళ్లిన మహిళ బాలుడి తల్లేనా? లేదా బాలుడిని తరలిస్తుందానే కోణంలో విచారిస్తున్నట్లు తెలిపారు. బాలుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే కాజీపేట జీఆర్పీ ఎస్‌హెచ్‌ఓ 8712658609, 9490027342 సెల్ నంబర్లలో సంప్రదించాలని కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి కోరారు.

చోరీలకు పాల్పడిన నిందితురాలి అరెస్ట్

- 171.23 గ్రాముల బంగారం, ఒక కారు స్వాధీనం

జనగామ రూరల్: రద్దీ ప్రదేశాల్లో దృష్టి మరల్చి పలువురి మహిళల నుంచి ఆభరణాలు అపహరిస్తున్న నిందితురాలిని జనగామ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ. 13 లక్షల విలువైన 171.23 గ్రాముల బంగారం, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ పి.దామోదర్‌రెడ్డి కథనం ప్రకారం.. జనగామకు చెందిన చొల్లేటి నివేదిత అక్టోబర్ 6వ తేదీన ఆర్టీసీ బస్సులో కాజీపేట నుంచి జనగామ వస్తోంది. ఈ క్రమంలో నిందితురాలు ఏపీలోని కర్నూల్ జిల్లా బుదారిపేటకు చెందిన అక్షింతల సంధ్య హైదరాబాద్ వెళ్లడానికి స్టేషన్ ఘన్‌పూర్‌లో ఇదే బస్సు ఎక్కి నివేదిత పక్కన కూర్చుంది. మాటల్లో దింపి నివేదిక వద్ద ఉన్న బంగారు ఆభరణాలు భద్రపరిచిన బ్యాగును అపహరించింది. జనగామ బస్టాండ్‌లో దిగిన నివేదిత ఇంటికి వెళ్లిన అనంతరం మరో బ్యాగును చూడగా అందులో ఆభరణాలు భద్రపరిచిన బ్యాగు కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ జనగామ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఏసీబీ పార్థసారథి పర్యవేక్షణలో చేపట్టారు. ఈ క్రమంలో సీఐ పి. దామోదర్ రెడ్డి, ఎస్సై భరత్ గురువారం మధ్యాహ్నం పెంబర్తి వై జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఓ కారు పోలీసులను చూసి కొద్ది దూరంలో ఆపి పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులకు అనుమానం వచ్చి విచారించారు. బస్సులో ఆభరణాలు ఉన్న బ్యాగును అపహరించింది తానేనని సంధ్య ఒప్పుకుంది. దీంతో నిందితురాలిని అరెస్ట్ చేసి రూ. 13 లక్షల విలువైన 171.23 గ్రాముల బంగారం, ఒక కారు స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు సీఐ దామోదర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. డ్రైవర్ పరారయ్యాడు. కాగా, కేసు చేధనలో ప్రతిభ కనబరిచిన సీఐ పి. దామోదర్ రెడ్డి , ఎస్సై భరత్, సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.

ఓరుగల్లులో సంస్కరణల సారథి

- 1992లో నిర్వహించిన కేయూ స్నాతకోత్సవానికి మన్మోహన్‌సింగ్



కేయూ స్నాతకోత్సవంలో అప్పటి ఆర్‌బీఐ గవర్నర్ మన్మోహన్‌సింగ్, గవర్నర్ కృష్ణకాంత్, వీసీ జయశంకర్. కార్యక్రమానికి వస్తున్న మన్మోహన్.

కేయూ క్యాంపస్ : 1992లో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆర్థిక సంస్కరణల సారథి డాక్టర్ మన్మోహన్‌సింగ్ పాల్గొన్నారు. అప్పటి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కొత్తపెల్లి జయశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సమయంలో కేంద్ర ఆర్థికమంత్రిగా ఉన్నడాక్టర్ మన్మోహన్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ ఆర్‌ఈసీ (ప్రస్తుత నిట్) ఆడిటోరియంలో కేయూ స్నాతకోత్సవం నిర్వహించారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్‌తో కలిసి పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ ప్రదానం కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ పాల్గొన్నారు. ప్రముఖ కవి దివంగత కాళోజీనారాయణరావు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు దివంగత నేరేళ్ల వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. మన్మోహన్‌సింగ్ 2004నుంచి 2014వరకు భారత ప్రధానిగా పదేళ్లపాటుసేవలు అందించారు. అంతకంటే ముందు అనేక పదవులు నిర్వర్తించారు. ఈనెల 26న రాత్రి మన్మోహన్ సింగ్ తుదిశ్వాసవిడిచిన విషయం విధితమే.

వికటించిన హెర్బల్ మందు..

- చికిత్స పొందుతూ మహిళ మృతి



యాదలక్ష్మి(ఫైల్)

చెన్నారావుపేట: హెర్బల్ మందు వాడగా వికటించడంతో ఎంజీఎంలో చికిత్స పొందుతూ మహిళ శుక్రవారం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బోజేర్వుకు చెందిన మిరాల మల్లయ్య, రాజమ్మ దంపతుల కూతురు యాదలక్ష్మి(40) భర్తతో విడిపోయి కుమారుడు వెంకటేశ్‌తో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. వైద్యుల సలహా మేరకు అల్లోపతి వైద్యం పొందుతోంది. ఈ నెల 16వ తేదీన వరంగల్‌కు చెందిన కవిత వద్ద రూ. 3 వేలు చెల్లించి హెర్బల్ మందు కొనుగోలు చేసి మూడు రోజులు వాడింది. 19న అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబీకులు గమనించి ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. యాదలక్ష్మి మృతితో కుమారుడు వెంకటేశ్ గుండెలవిసేలా రోదించాడు. తల్లి మృతితో ఒంటరయ్యాడు. మృతురాలి సోదరుడు ఐలయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిరాడంబరంగా సీఎం కప్ పోటీలు



హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న ఆదిలాబాద్, మెదక్ బాలుర జట్లు



హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న మెదక్, మహబూబ్‌నగర్ బాలికల జట్లు

- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శ్రద్ధాంజలి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఐదు రోజుల పాటు కొనసాగనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలు శుక్రవారం నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి క్రీడాలోకం సంతాపం తెలియజేసింది. క్రీడలు ప్రారంభించే ముందు అధికారులు, క్రీడాకారులు, టెక్నికల్ అఫీషియల్స్, రెఫరీలు రెండు నిమిషాలు మౌనం పాటించి మాజీ ప్రధాని మన్మోహన్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం స్టేడియంలోని వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ మైదానాల్లో సెపక్‌తక్రా నిర్వహించగా హ్యాండ్‌బాల్ గ్రౌండ్‌లో హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగినట్లు హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన భూవివాదం..

- దారి అటకాయించి కర్రతో కొట్టి వృద్ధుడి హత్య
- కాటారం మండల కేంద్రంలో ఘటన



బుచ్చయ్య (ఫైల్)

కాటారం: భూ వివాదాలు నిండు ప్రాణాలను బలిగొంటున్నాయి. రైతు కుటుంబాల్లో సంతోషాన్ని నింపే నేలలు.. వివాదాస్పదంగా మారి రక్తపు మడుగులతో అదే రైతు కుటుంబాల్లో విషాదాలకు దారితీస్తున్నాయి. కొన్నేళ్లుగా భూమి హద్దుల విషయంలో నెలకొన్న గొడవలతో ఓ వృద్ధుడిని దారి అటకాయించి హత్య చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఇప్పలగూడేనికి చెందిన డొంగిరి బుచ్చయ్య(65)కు కాటారం శివారులోని సర్వే నంబర్ 501లో 1.10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి హద్దుల విషయంలో సొదారి పోచయ్య, అతడి కుమారులు సమ్మయ్య, అంకయ్య, లింగయ్య, మృతుడు బుచ్చయ్య మధ్య మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా పరిష్కారం కాకపోవడంతో బుచ్చయ్య గత మే నెలలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు కొనసాగుతోంది. కాగా, ఇదే విషయంలో బుచ్చయ్య శుక్రవారం ఉదయం భూమి వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో బుచ్చయ్యకు సొదారి లింగయ్య అతడి భార్య శోభ మధ్య వాగ్వాదం నెలకొంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు తెలిసింది. దీంతో బుచ్చయ్య తన భార్య సారమ్మకు ఫోన్‌లో విషయం తెలిపి అక్కడి నుంచి బయలుదేరాడు. దాడి విషయం లింగయ్య తన కుమారుడు పవన్‌కు సమాచారం అందించాడు. ఆవేశానికి గురైన పవన్ ఇప్పలగూడెంలోని హనుమాన్ టెంపుల్ వద్ద బుచ్చయ్య బైక్‌పై వెళ్తున్న క్రమంలో అటకాయించి కర్రతో కొట్టడంతో కిందపడ్డాడు. దీంతో పవన్ వెంటనే బుచ్చయ్య తలపై విచక్షణారహితంగా కొట్టడంతో మృతిచెందాడు. ఈ క్రమంలో మృతుడి భార్య సారమ్మ, కూతుళ్లు దుర్గం సుగంధ, జాడి శోభ పొలం వద్దకు వెళ్తూ బుచ్చయ్యపై దాడి జరగడాన్ని గమనించి అక్కడికి వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. హత్యకు పాల్పడిన పవన్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న కాటారం సీఐ నాగార్జునరావు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దీక్షాంత్ పరేడ్ రద్దు..



తల్లికి టోపి పెడుతున్న కుమారుడు



భార్యకు టోపి పెడుతున్న కానిస్టేబుల్



తల్లికి పాదాభివందనం చేస్తున్న కానిస్టేబుల్



తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటూ..



తనకు కాబోయే భార్య పావనికి సెల్యూట్ చేస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన రాజశేఖర్

మాజీ ప్రధాని మన్మోహన్ మృతితో పరేడ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ

- నిరుత్సాహంతో వెనుదిరిగిన స్పెషల్ కానిస్టేబుళ్ల బంధువులు

మామునూరు : ఖిలా వరంగల్ మండలం మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో శుక్రవారం జరగాల్సిన 457 మంది స్పెషల్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) రద్దుయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ దీక్షాంత్ పరేడ్ రద్దు చేశారు. ఈ మేరకు హైదరాబాద్ టీజీ ఎస్పీ కమిషరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీక్షాంత్ పరేడ్ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని కామాండెంట్ రాంప్రకాశ్ వెల్లడించారు. కాగా, కానిస్టేబుళ్ల బంధువులు, స్నేహితులు ఉదయమే పరేడ్ ప్రాంగణానికి చేరారు. దీంతో కానిస్టేబుళ్లు.. బంధువులను కలిసి ముచ్చటిస్తూ ఆనందంలో మునిగితేలారు. మరో కొద్ది నిమిషాల్లో బాధ్యతలు చేపడుతామనుకునే సమయంలో పరేడ్ రద్దయిందని తెలియడంతో ఆ క్షణం వరకు ఆనందంగా ఉన్న కానిస్టేబుళ్లు, వారి బంధువులు ఒక్కసారి నిరుత్సాహానికి గురయ్యారు. దీంతో చేసేది ఏమిలేక కానిస్టేబుళ్లు తమ కుటుంబ సభ్యులు, బంధువులతో ఫొటోలు దిగుతూ గడిపారు. కుటుంబీకులు, బంధువులు కొద్ది సమయం సేదదీరిన అనంతరం వెనుదిరిగారు.